బడిలో భయం భయం


భవనంపై ప్రమాదకర పగుళ్లు గదుల్లో పెచ్చులూడుతున్న స్లాబ్



భవనంపై స్లాబ్ ఇలా..

తూప్రాన్ ప్రాథమిక పాఠశాల భవనానికి పగుళ్లు రావడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు తరగతి గదుల్లో పెచ్చులూడుతున్నాయి. వర్షం పడిన సమయంలో విద్యార్థులను వరండాలోనే కూర్చోబెడుతున్నారు. ఇక్కడ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 370 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు గదుల్లో నీరు లీకేజీ అవుతుండడంతో కొన్నిరోజులుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

తేలిపోయిన నాణ్యత.. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా భవనంపై రెండేళ్ల క్రితం మరమ్మతులు చేయించారు. అయినా పెచ్చులూడి నీరు లీకేజీ అవుతోంది. భవనం పై అంతస్తులో కాలు పెడితే గుంత పడే స్థాయిలో ఉందంటే పనులు ఏ స్థాయిలో చేశారో అర్థమవుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయమై హెచ్‌ఎం లక్ష్మణ్ మాట్లాడుతూ.. సమస్య తీవ్రతను పాలకుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, లీకేజీలకు సంబంధించి అధికారులతో చర్చించి మరమ్మతులు చేయిస్తామన్నారు. -న్యూస్‌టుడే, తూప్రాన్



అతివలకు ఆర్థిక భద్రత

బీసీ సఖి ద్వారా బ్యాంకింగ్ సేవలకు అవకాశం

న్యూస్‌టుడే, మెదక్



బయోమెట్రిక్ పరికరం అందజేస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్‌రావు

ఇందిరా మహిళా శక్తి ద్వారా వివిధ యూనిట్లకు సాయం చేస్తున్న ప్రభుత్వం... వారికి మరింత ఆర్థిక భద్రత కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే 'బ్యాంకింగ్ కరస్పాండెంట్ సఖి(బీసీ సఖి)' ప్రారంభించింది. అర్హత గల వారికి బ్యాంకింగ్ సేవలపై తర్ఫీదునిచ్చి బయోమెట్రిక్ యంత్రాలను సైతం అందజేసింది. వచ్చే నెల నుంచి గ్రామాల్లో బ్యాంకింగ్ సేవలు ప్రారంభం కానున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలు పెరిగాయి. మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లోనే వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్నారు. చాలా వరకు గ్రామాల్లో సేవలు అందకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాలంటే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 'బ్యాంకింగ్ కరస్పాండెంట్ సఖి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

75 మంది బీసీఏలు... మహిళల్లో పదోతరగతి ఉత్తీర్ణులై, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన ఉన్న వారికి సెర్ప్ ఆధ్వర్యంలో ప్రాధాన్యత కల్పించారు. ఈ క్రమంలోనే 75 మంది ముందుకొచ్చారు. వీరికి సంగారెడ్డిలో కొద్దినెలల క్రితం ఆరు రోజుల శిక్షణ ఇవ్వగా, తాజాగా టాస్క్ ఆధ్వర్యంలో మరోసారి ఈ నెల 24, 25 తేదీల్లో అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసిన వారిలో 69 మంది మహిళలకు డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏపీడీ సరస్వతి బయోమెట్రిక్ పరికరాలను పంపిణీ చేశారు. నార్సింగి మినహా మిగిలిన మండలాల్లో బీసీ సఖి సేవలు అందనున్నాయి.

వ్యాపార విస్తరణకు అవకాశం...

డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చినా... నగదు ఉపసంహరణ, డిపాజిట్ వంటివి కొనసాగుతున్నాయి. దీంతో బీసీ సఖి ద్వారా నియమితులైన వారికి అందజేసిన బయోమెట్రిక్ పరికరం ద్వారా సేవలను పొందవచ్చు. ఈ క్రమంలోనే ల్యాప్‌టాప్, కంప్యూటర్ కొనుగోలుకు రుణ సౌకర్యం అందించనున్నారు. మరోవైపు పలు బ్యాంకుల సేవలతో పాటు తపాలా శాఖ, ఎల్‌ఐసీ సంస్థ వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నాయి. నగదు ఉపసంహరణతో పాటు డిపాజిట్లు, తపాలా, ఎల్‌ఐసీకి సంబంధించిన బీమా పాలసీ చేయడం, వాటి డబ్బులను చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఇదిలా ఉంటే గ్రామాల్లో పింఛన్ పొందే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారు బీసీఏల ద్వారా పింఛన్ సైతం పొందవచ్చు. ఇందుకు సంబంధించి ఆయా బ్యాంకులు, సంస్థలు కమిషన్ అందజేస్తాయి. ప్రస్తుతం ఎంపికైన బీసీఏలు ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తే అదనంగా ఆదాయం సమకూరనుంది.

పట్టించుకునేదెవరు.. బాగు చేసేదెవరు!

దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులపై తారు తొలగిపోయి, కంకర తేలి, గుంతలు, కయ్యలు ఏర్పడ్డాయి. వాహనాలు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. చివరకు నడవాలన్నా కష్టమే. ఇది వెల్దుర్తి మండల కేంద్రం నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే దారుల పరిస్థితి. వీటికి ఏళ్ల కిందట నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు చేపట్టకపోవడం గమనార్హం. **న్యూస్‌టుడే, వెల్దుర్తి**

19 కిలోమీటర్లు నిలువెల్లా గాయాలు



న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

వెల్దుర్తి నుంచి మెదక్ పట్టణ శివారులోని పిల్లికొట్టాల వరకు 19 కి.మీ. దూరం ఉంటుంది. ఆసాంతం గుంతలు, కయ్యలు ఏర్పడ్డాయి. కంకర తేలింది. ఈ మార్గంలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పదేళ్లుగా రెండు వరుసలకు విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. చివరకు మూడేళ్ల కిందట ప్రభుత్వం రీబీటీ నిమిత్తం రూ.11 కోట్లు మంజూరు చేసింది. టెండరు దక్కించుకున్న గుత్తేదారు జాప్యం చేస్తూ వచ్చారు. ప్రస్తుతం అది ఎక్కడికక్కడ అధ్వానంగా మారింది. వర్షం కురిస్తే ప్రయాణం నరకప్రాయమే అవుతోంది.

గుత్తేదారులు ముందుకు రాక..



వెల్దుర్తి నుంచి యశ్వంతరావుపేట మీదుగా మంగళపర్తి వరకు ఉన్న 9 కి.మీ. పూర్తిగా అధ్వానంగా మారింది. ఎక్కడో ఓ చోట తారు కనిపిస్తుంది. కంకర తేలి, గుంతలు, కయ్యలు ఏర్పడి చివరకు సైకిళ్లు కూడా వెళ్లలేని దుస్థితికి చేరింది. దీంతో స్థానికులు కుకునూర్ మీదుగా చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని ఈ రోడ్డు రీబీటీకి నాలుగేళ్ల క్రితం రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు నాలుగు సార్లు ప్రక్రియ చేపట్టినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయమై పీఆర్ ఏఈ పవన్‌ను ఆరా తీయగా.. మళ్లీ రూ.5.34 కోట్లతో ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

ఇలవేల్పులకు పస్తులు.. సొంతానికి నిధులు!

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

విఘ్న

ఆదాయం లేని పురాతన ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రతి గుడికి నెలకు రూ.10వేలు అందజేస్తోంది. ఇందులో అర్చకుడికి గౌరవ వేతనంగా రూ.7వేలు, నిత్య కైంకర్యాలు, ఖర్చులకు రూ.3 వేలు వెచ్చిస్తున్నారు. పూజలకు నోచని చిన్న, పురాతన ఆలయాలను పరిరక్షించడం ఈ పథకం లక్ష్యం. ఇంత వరకు బాగానే ఉన్నా, ఆలయాల్లో పూజలు చేయకుండానే వేతనాలు తీసుకోవడం, స్థానికంగా ఉండకుండా, వారానికోసారి కూడా ధూపదీప నైవేద్యం పెట్టకుండా కొందరు నెలకు వచ్చే డబ్బులను తమ జేబులో వేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

974 మందిలో.. 96 మంది అనర్హులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 274 ఆలయాలున్నాయి. వీటిలో ఆదాయం వచ్చేవి 39 ఉన్నట్లుగా ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పథకం వర్తిస్తున్న ఆలయాలపై దేవాదాయ శాఖ మార్చి, ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెర్ప్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 974 మందికి రూ.10 వేలు మంజూరు చేస్తోంది. ఇందులో 96 మంది అనర్హులుగా తేల్చారు. నెలకు రూ.9.60 లక్షలు దుర్వినియోగం అయినట్లుగా తేల్చారు. ఇందులో కొంత మంది మృతి చెందిన వారు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని పలువురు అర్చకులు కోరుతున్నారు. ఇందులో చాలా పల్లెలో, పట్టణాల్లో ఆలయాలు లేకున్నా, పూజలు చేయకున్నా చేసినట్లుగా పేర్లు నమోదు చేసి ఆయా నిధులను తీసుకుంటున్నట్లుగా విమర్శలున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం

96 మంది అనర్హులుగా తేలారు. అయితే ప్రభుత్వ నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ధూపదీప నైవేద్యం సమర్పించకుండా, ఆలయాలు లేకున్నా ఉన్నట్లుగా నెలకు డబ్బులు తీసుకోవడం చట్టరీత్యా నేరం.

– విజయరామారావు, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ

ఇందిరమ్మ చీరలు వచ్చేశాయ్..



బతుకమ్మ పండుగ కోసం మహిళలకు ఇచ్చే ఇందిరమ్మ చీరలు ఈసారి ముందుగానే మండల సమాఖ్యలకు చేరుకుంటున్నాయి. గతేడాది నీలం రంగులో చీరలున్నాయి. ఈసారి మాత్రం చిలకపచ్చ రంగు, మెరూన్ రంగు అంచుతో డిజైన్ చేశారు. రెండు నెలల ముందుగానే వీటిని సరఫరా చేస్తున్నారు. ఇంట్లో ఉన్న మహిళలందరికీ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. రెండు రోజుల క్రితమే చేగుంట మండల సమాఖ్యకు చీరల సంచులు లారీలో వచ్చాయి. –న్యూస్‌టుడే, చేగుంట

ఎరువుల్లేవ్.. ఆదాయం లేదు

వృథాగా కంపోస్టు షెడ్లు



చేగుంట మండలం మక్కరాజుపేటలో వృథాగా ఉన్న కంపోస్టు షెడ్డు

న్యూస్‌టుడే, చేగుంట: ఐదేళ్ల క్రితం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు ఎరువుల తయారీ షెడ్లు వృథాగా మారుతున్నాయి. మొదట్లో అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయడంతో చెత్తాచెదారంతో సేంద్రియ ఎరువులను తయారు చేశారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరింది. తర్వాత నిర్వహణ గాలికొదిలేయడంతో జిల్లాలో నిర్మించిన కంపోస్టు షెడ్లు ఎక్కడికక్కడ ఖాళీగా కనిపిస్తున్నాయి.

జిల్లా వివరాలు..
- మొత్తం పంచాయతీలు 492
- డంప్‌యార్డులున్న గ్రామాలు 469
- కంపోస్టు యార్డులకు వ్యయం రూ.11.72 కోట్లు

మొదట్లో ఆసక్తి చూపించినా..

వానపాములతో 60 రోజుల వ్యవధిలోనే సేంద్రియ ఎరువు తయారవుతుంది. ప్రభుత్వ సూచన మేరకు చాలా పంచాయతీ అధికారులు రూ.4 వేలు ఖర్చు చేసి వానపాములను కొనుగోలు చేసి డంపింగ్ యార్డులో వేశారు. ప్రతి రోజు నీరు పట్టడం ద్వారా వాటి పునరుత్పత్తి పెరుగుతుంది. అయితే షెడ్లలో నీరు పట్టకపోవడంతో అవి చనిపోయాయి. మొదట్లో ఆసక్తి చూపించినా అనంతరం వాటి గురించి మరచిపోయారు.

చక్కని ఫలితాలు వచ్చినా..

జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో రూ.2.50 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. మొదట్లో సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించారు. చాలా పల్లెల్లో చక్కని ఫలితాలు వచ్చాయి. ఒక్క చేగుంట మండలం ఇబ్రాహీంపూర్‌లో మొదటి ఏడాదిలోనే రూ.60 వేల ఆదాయం వచ్చింది. ఈ డబ్బులను గ్రామాభివృద్ధికి వినియోగించారు. ఆ తర్వాత పర్యవేక్షణ కరవైంది.

తడి, పొడి తడబడింది..

ప్రారంభంలో తడి, పొడి చెత్తను వేరు చేసేలా చెత్తబుట్టలను అందజేశారు. వాటి ద్వారా అందజేసిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు డంపింగ్ యార్డు వద్దకు తీసుకెళ్లి అక్కడ వేర్వేరుగా వేసేవారు. ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు వంటి వస్తువులను వేరు చేసి షెడ్డులో ఉన్న అరల్లో వేసేవారు. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు పంపించాలి. తడి చెత్తను మరో అరలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలి. ప్రస్తుతం ఎక్కడ కూడా ఇలా చేయడం లేదు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడే వ్యర్థాలు పారబోస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నాలుగు రకాల చెత్తను వేరు చేయాలని ప్రచారం చేసింది. కానీ అది చాలా చోట్ల అమలు కావడం లేదు.

సిరిధాన్యాల ఘుమఘుమలు

జొన్న రొట్టెలు.. మరోవైపు రాగి దోసెలు.. పక్కనే సజ్జల మురుకులు.. ఇంకో చోట చిరుధాన్యాల ఇడ్లీలు.. యువత అభిరుచికి తగ్గట్లు మిల్లెట్ వెజ్ బిర్యానీ.. ఇలా ఎటు చూసినా సిరిధాన్యాల ఘుమఘుమలే. ఒకప్పుడు ప్రతి ఇంటి కంచంలో కనిపించిన ఈ ఆహారమే, మళ్లీ మన వంటిళ్లలోకి అడుగుపెడుతున్న దృశ్యం జహీరాబాద్‌లో ఆవిష్కృతమైంది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) కార్యాలయం ఆవరణలో ఆదివారం ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిధాన్యాల వంటల పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మంది మహిళా రైతులు, విద్యార్థులు పాల్గొని చిరుధాన్యాలతో తయారు చేసిన 40కి పైగా రకాల వంటకాలను ప్రదర్శించారు.

–న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, జహీరాబాద్





అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

తరలివచ్చి వనదుర్గమ్మ సేవలో తరించి

పాపన్నపేట(మెదక్ టౌన్), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

జూనియర్ కళాశాలల్లో డిజిటల్ విప్లవం

కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతనంగా కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఒక్కో కళాశాలకు రూ.25 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నిధులను అందిస్తూ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించిన విధివిధానాలను స్పష్టం చేశారు.

మండలాల వివరాలివీ.. నర్సాపూర్, పాపన్నపేట, నార్సింగి, కౌడిపల్లి

ప్రయోగ పరిజ్ఞానం పెరుగుతుంది



ప్రస్తుత ఇంటర్ విద్యాశాఖ, ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థుల్లో ప్రయోగ పరిజ్ఞానం పెరిగేందుకు అవకాశం ఉంది. తాజా నిర్ణయంతో ప్రతి రోజు కేటాయించిన సమయంలో ప్రయోగాలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అయింది. నైపుణ్యాలు పెంచుకుంటే జీవితంలో త్వరగా స్థిరపడవచ్చు.

–మాధవి, ఇంటర్ జిల్లా నోడల్ అధికారిణి, మెదక్

నైపుణ్యాలకు పదును.. ప్రభుత్వ కళాశాలల్లో ఇంత కాలం కంప్యూటర్ బోధన పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలకు దూరమవుతూ వస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో ఫిజిక్స్ వాలా ద్వారా ఐఐటీ, జేఈఈ కోచింగ్, ఖాన్ అకాడమీ ద్వారా క్లాట్ తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. గతేడాది అన్ని కళాశాలలకు ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను అందజేయడంతో డిజిటల్ బోధన ఊపందుకుంది. ఈ తరుణంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించేలా ప్రత్యేక ల్యాబ్‌ల నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని విద్యావర్గాలు భావిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో మిగతా కళాశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధ్యాపకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

జిల్లాలోని కళాశాలలు: 16 ఎంపికైనవి: 4

నిధులతో ఏం చేస్తారంటే..

ప్రత్యేకంగా గది ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్లు, కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బల్లలు వంటి ఫర్నిచర్ అందిస్తారు. విద్యార్థులకు ఏఐ, తదితర వాటిని బోధిస్తారు. అన్ని వసతులు సమకూర్చిన తర్వాత అధ్యాపకులకు కంప్యూటర్ బోధనపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

నిరీక్షించలేక ఓపిక నశిస్తోంది!

తాత్కాలిక షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ప్రయాణికుల కోసం తాత్కాలిక బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా వీటి గురించి పట్టించుకునే వారే కరవయ్యారు. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రోజు 40 వేల మంది వరకు వస్తుంటారు.

ప్రధాన కూడళ్లలో ఇలా..

రాందాస్ చౌరస్తా, రాయాలయం, నర్సాపూర్, ప్రధాన తపాలా కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ యార్డు, ధ్యాన్‌చంద్ చౌరస్తా, ఆటోనగర్, మెదక్-చేగుంట ప్రధాన రహదారిలోని ఎంసీహెచ్ వద్ద, పిల్లికొట్టాల్ తదితర ప్రధాన కూడళ్లు ఉన్నాయి. నిత్యం పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తిరుగు ప్రయాణంలో బస్సులు, ప్రైవేట్ వాహనాల కోసం ప్రధాన చౌరస్తాల్లో గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఇక్కడ బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఎండలో ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఇక వానాకాలంలో అయితే వర్షంలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



ఎంసీహెచ్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న గర్భిణులు

రోడ్డు విస్తరణ కారణంగా..

పట్టణంలోని రామాలయం గుడి వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ఐదేళ్ల క్రితం వరకు అందుబాటులో ఉంది. మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆ దానిని తొలగించారు. ఈ సమయంలో క్లబ్ సభ్యులు అడ్డు చెప్పడంతో విస్తరణ పనులు పూర్తయిన వెంటనే మళ్లీ ఏర్పాటు చేస్తామని ర.భ. అధికారులు నచ్చజెప్పడంతో అంగీకరించారు. ఆ తర్వాత దాని గురించే మరచిపోయారు. ప్రధానంగా పిల్లికొటాల్ వద్ద ఏర్పాటు చేసిన ఎంసీహెచ్ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు బస్సులు, వాహనాల కోసం గంటల తరబడి నిలబడేందుకు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ ఇంట్లో చొరబడిన దొంగ

పలు కాలనీల్లో చోరీ



సీసీ కెమెరాలో నిందితుడి చిత్రం

తూప్రాన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ హల్‌చల్ చేశాడు. పట్టణంలోని పోలీస్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీలోని ఇళ్లలోకి చొరబడ్డాడు. ఓ పోలీసు అధికారి ఇంట్లో ఉన్న స్కూటీని ఎత్తుకెళ్లాడు. సుమారు ఒక గంటకు పైగా కాలనీల్లోని పలు ఇళ్లలో చొరబడి ఆరబెట్టిన దుస్తులు, సామగ్రి అపహరించారు. ఉదయం గమనించిన యజమానులు స్కూటీ, సామగ్రి చోరీకి గురైందని గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక నిందితుడు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వరుస చోరీలతో పట్టణ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ పెంచి చోరీలకు అడ్డుకట్ట పడేలా చూడాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, తూప్రాన్

పరీక్షలు పాసైతేనే ప్రవేశం



30 మీటర్ల పరుగులో పాల్గొన్న విద్యార్థినులు

బ్రాడ్ జంప్ చేస్తూ..

చేగుంటలోని తెలంగాణ గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. మెడిసిన్ త్రోబాల్, బ్రాడ్‌జంప్, షటిల్‌రన్, పరుగు, ఎత్తు, బరువు వంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపితేనే ప్రవేశాలు లభిస్తాయి. విద్యార్థులు ఉదయం నుంచే తమ తల్లిదండ్రులతో క్రీడా పాఠశాలకు చేరుకున్నారు. గిరిజన గురుకులాల క్రీడాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఆరు, ఏడు, ఎనిమిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దేహదారుఢ్య పరీక్షలు చేశారు. –న్యూస్‌టుడే, చేగుంట

మాకూ కావాలి.. ఓ అథారిటీ

• ఉమ్మడి జిల్లాలో నాలుగు ఏర్పాటుకు అవకాశం

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పట్టణాలను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో సుడా, గజ్వేల్‌లో గడా పేరిట రెండు యూడీఏలు ఏర్పాటు చేశారు. రాజధానికి సమీపంలో ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్‌లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పట్టణాల పరిసర ప్రాంతాలను కలుపుకొని అథారిటీలు ఏర్పాటు చేస్తే సమీప ప్రాంతాలు ప్రగతిపథంలో పయనించనున్నాయి.

సుడాపై నిర్లక్ష్యం.. ప్రగతికి దూరం

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టూ 20 కి.మీ.ల పరిధిలోని గ్రామాలను కలుపుతూ సుడా(సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. గత రెండున్నరేళ్ల నుంచి పాలకమండలి లేకపోవడంతో పాటు పర్యవేక్షణ అధికారిని నియమించలేదు. దీంతో ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితం అయింది. ఇదే విధంగా గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన గడా భారాస అధికారం కోల్పోవడంతో రద్దయింది.



సంగారెడ్డి ముఖ చిత్రం

ప్రజాప్రతినిధులు చొరవ చూపితేనే

రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకొస్తేనే అథారిటీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించిన సమయంలో వీటి ఏర్పాటును ప్రకటిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించినా నిరాశే ఎదురైంది. –ఈనాడు, సంగారెడ్డి

జోరుగా స్థిరాస్తి వ్యాపారం

రాజధానికి సమీపంలో ఉండడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. దేశవిదేశాలకు చెందిన పేరొందిన సంస్థలు ఈ ప్రాంతంలో భూముల మీద పెట్టుబడులు పెడుతున్నాయి. స్థిరాస్తి వెంచర్లు ఏర్పాటు చేసి తమ వ్యాపార కార్యకలాపాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదేవిధంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్(జాతీయ పెట్టుబడుల ఉత్పత్తి మండలి)లో పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలోనే జహీరాబాద్‌తో పాటు సమీప గ్రామాలను కలుపుతూ జహీరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తేనే ప్రణాళికయుతంగా పట్టణీకరణ జరగనుంది. నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలకు అవకాశాలున్నాయి.

ఉపయోగాలు ఇలా..

• యూడీఏ ఏర్పాటైతే పట్టణ ప్రాంతాల సమగ్ర, క్రమబద్ధమైన అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి పట్టణాభివృద్ధి సంస్థల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి.
• మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నివాసయోగ్యమైన పట్టణ జీవనాన్ని ప్రోత్సహించవచ్చు. మాస్టర్ ప్లాన్ రూపొందించి భూ వినియోగాన్ని నియంత్రించొచ్చు.
• కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వివిధ పథకాల ద్వారా లభించే నిధులతో కలిసి, శివారు గ్రామాల స్వరూపం మారుతుంది. ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షించడంతో స్థానికంగా ఉపాధి పెరుగుతుంది.

మమ్మేలు.. కొమురవెల్లి మల్లన్న



అధికారులు, అర్చకులకు వెండి బిందె, చెంబు అందజేస్తున్న దాతలు



కొమురవెల్లి: ప్రసాదాల కోసం వరుసలో భక్తులు

చేర్యాల, న్యూస్‌టుడే: 'మొక్కులు తీర్చుకున్నం మల్లన్నా.. చల్లంగా దీవించన్నా..' అంటూ భక్తుల వేడుకోలుతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం మార్మోగింది. శ్రావణ మాసం కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. స్వామి దర్శన, ప్రసాదాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. మల్లన్న దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. 37 కుటుంబాలు అభిషేకం నిర్వహించగా, 24 కుటుంబాల సభ్యులు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారని, 20 వేల మంది దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లికి చెందిన అంబటిపల్లి యాదలక్ష్మి కుటుంబ సభ్యులు సుమారు రూ.4 లక్షల విలువైన 1.876 కిలోల వెండితో తయారు చేయించిన బిందె, చెంబులను సమర్పించారు. ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుకు దాతలు అంబటిపల్లి మల్లికార్జున్, వెంకటనరేందర్, రాము అందించారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అమలు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ.4016 వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఆదివారం నిర్వహించిన బీడీ సిగార్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి సుమారు 7లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో. . అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ ప్రస్తుతం ఇస్తున్న భృతిని రూ.4016లకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల పించను రూ.7500లకు పెంచాలని, వెంటనే కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, సీఐటీయూ నేతలు సుధాకర్, గోపాలస్వామి, భాస్కర్, శశిధర్, రవికుమార్, శోభ, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ వాసి ప్రతిభ



అందుకున్న పతకాలు చూపిస్తున్న ప్రభు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగాయి. మెదక్ పట్టణానికి చెందిన కొక్కొండ ప్రభు 65 ఏళ్ల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. మెదక్ జిల్లా క్రీడాకారులు, మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, రాజేందర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు



పాల్గొన్న క్రీడాకారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలోని ఎంఎస్ క్రికెట్ మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-16 ఎంపికలు ఆదివారం నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 124 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన వారు సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-16 టోర్నీలో పాల్గొనాల్సి ఉంటుందని ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి తెలిపారు.

నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య



మాట్లాడుతున్న విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంగారెడ్డి పట్టణంలోని టీపీటీఎఫ్ భవన్‌లో 'ప్రభుత్వ బడుల బలోపేతం- ప్రభుత్వ బాధ్యత- మనకర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యకు 20 శాతం నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. 23 వేల బడులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. విద్య ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూత పడుతున్నాయని ఆరోపించారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ముందుకు రావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఎస్టీయూ రాష్ట్ర కోశాధికారి సయ్యద్ సాబేర్‌అలీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భూములు.. అధికారాలను లాక్కుంటారా?

• ఉత్తర్వులపై సర్పంచుల మండిపాటు • టీజీఐఐసీ, గ్రామీణాభివృద్ధి శాఖల నిర్ణయంపై నిరసనలు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, ఝరాసంగం, న్యాల్‌కల్: జహీరాబాద్ నిమ్జ్(జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి) ఏర్పాటు ప్రక్రియలో జారీ చేసిన కొత్త నిబంధన స్థానికంగా తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది. ఇప్పటికే సారవంతమైన భూములు కోల్పోయి రోడ్డున పడుతున్న రైతులకు తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మరింత శరాఘాతంగా పరిణమించాయి. పరిశ్రమల పేరుతో భూములు సేకరించడమే కాకుండా స్థానిక గ్రామ పంచాయతీల అధికారాలను టీజీఐఐసీ, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు బదలాయించాలంటూ జారీ అయిన సంయుక్త నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థుల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ నిర్ణయంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

బదలాయింపుతో ఆదాయానికి గండి..

ఝరాసంగం మండలంలోని 3, న్యాల్‌కల్ మండలంలోని 14 గ్రామాల పరిధిలో నిమ్జ్ కోసం భూసేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలో టీజీఐఐసీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా జారీ చేసిన నోటిఫికేషన్ స్థానిక సర్పంచులను విస్మయానికి గురిచేస్తోంది. సేకరించిన భూముల్లో భవిష్యత్తులో పరిశ్రమలు ఏర్పాటయ్యాక వచ్చే ఎలాంటి ఆదాయం ఆయా గ్రామ పంచాయతీలకు చెందకుండా నేరుగా టీజీఐఐసీకి జమయ్యేలా తీర్మానాలు పంపాలని ఆదేశించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది పంచాయతీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందని, సర్పంచులు, వార్డు సభ్యుల అధికారాలను లాక్కునే కుట్ర జరుగుతోందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన 17 పంచాయతీలు అధికారాల బదలాయింపునకు వ్యతిరేకంగా ఇప్పటికే తీర్మానాలు చేయడం గమనార్హం.



ఎల్గోయిలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ పాలకులు

హామీల అమలు ఉత్తిమాటేనా..?

బాధితులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచులు డిమాండు చేస్తున్నారు. గతేడాది జహీరాబాద్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి భూ బాధితులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల హామీ ఇప్పటికీ నెరవేరలేదని ప్రజలు గుర్తుచేస్తున్నారు. తమ పొట్ట కొట్టి అధికారాలను లాక్కునే నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

అదనపు సర్వే నంబర్ల కలకలం..

ఒకవైపు అధికారాల కోతతో సర్పంచులు రగిలిపోతుంటే.. మరోవైపు అదనపు సర్వే నంబర్ల చేరిక రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములు కోల్పోతున్న తరుణంలో ముందస్తు సమాచారం లేకుండా అదనంగా మరిన్ని సర్వే నంబర్లను జాబితాలో చేర్చడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని లాక్కుంటే తమ బతుకులు వీధిన పడతాయని రైతులు వాపోతున్నారు. జాబితాలో చేరిన అదనపు సర్వే నంబర్లను వెంటనే తొలగించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు టీజీఐఐసీ ఈడీ వీరారెడ్డిని కలిసి సమస్య వివరించారు.

ఉత్తర్వుల సమాచారం అందలేదు..

నిమ్జ్ భూసేకరణ గ్రామాల్లో పంచాయతీల అధికార బదలాంపులపై రెవెన్యూ శాఖకు ఉత్తర్వుల సమాచారం అందలేదు. భూసేకరణ సహా మిగతా వ్యవహారాలు నిమ్జ్ భూసేకరణ అధికారులు చూసుకుంటారు. – దేవుజా, ఆర్డీవో జహీరాబాద్

విద్యార్థి భవితకు.. విజ్ఞాన్ మంథన్

▲ సెప్టెంబరు 30వరకు దరఖాస్తులకు గడువు

జిల్లా	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
సిద్దిపేట	579	87,224	20	6,443
సంగారెడ్డి	211	67,500	20	6,400
మెదక్	156	28,636	16	5,669
వికారాబాద్	176	30,200	14	5,500

న్యూస్‌టుడే, సిద్దిపేట గ్రామీణం, సంగారెడ్డి మున్సిపాలిటీ, చేగుంట: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆరో తరగతి నుంచి ఇంటర్ (11వ తరగతి) వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు ఇస్రో, డీఆర్డీవో శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించే సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ క్రమంలోనే నగదు పురస్కారాలు, భాస్కర పేరిట ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యాన్ని గుర్తించి విజ్ఞానశాస్త్ర రంగంలో దేశ పురోగతిపై అవగాహన, ప్రయోగాలపై మక్కువ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా విజ్ఞానభారతి, విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరిట ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు.

అర్హులు.. నమోదు ఇలా..

6 నుంచి 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులు. రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబరు 30వ తేదీలోపు అధికారిక వెబ్‌సైట్ https://vvm.org.in ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ విధానంలో తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. వెబ్‌సైట్ లేదా చరవాణి యాప్ ఆధారితంగా పరీక్ష రాయొచ్చు. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 తరగతులు ఉంటాయి. చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించి పరీక్ష రాయొచ్చు.

ఇవీ ప్రయోజనాలు...

పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయి. రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి క్యాంపులు, శ్రీజాన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఇస్రో, డీఆర్డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ వంటి ప్రముఖ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించడం, శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. విజేతలకు భాస్కర పేరిట ఉపకార వేతనాలు, ప్రముఖ సైన్స్ ప్రయోగశాలలు సందర్శించే అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞాన్ మంథన్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిద్దిపేట డీఈవో రమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చేర్యాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. చేర్యాలకు చెందిన యాంసాని పాండు, **వసంత** (59) ద్విచక్రవాహనంపై శనివారం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఆదివారం ఇంటికి వస్తున్నారు. కొమురవెల్లి ఠాణా పరిధిలోని గుర్జకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండుకు స్వల్ప గాయాలు కాగా, వసంత తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి సిద్దిపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ముడిసరకొచ్చింది.. ఇక్కత్ గిరాకీ పెరిగింది



దారాల నుంచి బీమ్‌లు పోస్తూ..

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘం ఎన్నికలు పూర్తయి పాలకమండలి ఏర్పడటంతో వస్త్రాల తయారీ.. గిరాకీకి తగినట్టుగా సంస్థలకు అందించే పనుల్లో నేతకార్మికులు నిమగ్నమయ్యారు. రూ.8 లక్షల విలువైన ముడి సరుకు వచ్చింది. ప్రతి నెలా ఆర్డర్లను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో ప్రస్తుతం తక్కువ సంఖ్యలో చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. విభిన్న రంగుల్లో కాటన్, జరీ, పట్టు చీరలతో పాటు ఇక్కత్ చీరలు, లెనిన్ కాటన్ వస్త్రాలను తయారు చేస్తున్నారు. దుబ్బాక చేనేత సొసైటీలో ప్రస్తుతం 40 మగ్గాలతో 36 మంది కార్మికులు పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్, బెడ్ షీట్స్ వంటివి నేస్తున్నారు. మరో 15 మంది కండెలు చుట్టడం, బీమ్‌లు పోయడం, నింపడం చేపడుతున్నారు.

దుబ్బాక సొసైటీ పనులు, ప్రణాళిక

◆ 8 మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ చీరలు తయారుచేస్తారు. ◆ 25 మగ్గాల మీద రోజూ 200 కాటన్ తువ్వాళ్లు ◆ సీతాకోకచిలుక, శంఖం, పూల ఆకృతుల్లో ఇక్కత్ చీర తయారవుతుంది. ◆ కార్మికులంతా రోజూ 6 చీరలు నేస్తున్నారు. ◆ ఖర్చులు రూ.2500; తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కొనుగోలు ధర రూ.2800 ఉంటోంది. ◆ తువ్వాలు ఒక్కంటికి రూ.160 ఖర్చు; టెస్కో కొనుగోలు ధర రూ.180 ఉంటోంది. ◆ జకార్డు మగ్గాలు కేవలం 2 ఉన్నాయి. ఇటీవల మరొకటి కొనుగోలు చేశారు. ◆ ప్యూర్ పట్టు.. కాటన్ జరీ.. గొల్లభామ చీరల తయారీ స్వల్పం. ◆ రూ.8 లక్షలతో ముడిసరుకు కొన్నారు. కార్మికుల 3 నెలల వేతనాలు సైతం సొసైటీ చెల్లించింది.

విలువైన పట్టు జరీ చీరలు సైతం తయారుచేస్తాం..

చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధికి అండగా నిలుస్తున్నాం. అన్ని రకాల ఆకృతులతో, విభిన్న రంగుల్లో నేస్తున్న పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్‌కు గిరాకీ పెరిగింది. త్వరలోనే అధిక ధర కలిగిన పట్టు జరీ చీరలను నేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
–అంకం మధు, దుబ్బాక చేనేత సహకార సొసైటీ ఛైర్మన్

మార్జాలంపై మమకారం

• గాయపడిన పిల్లికి శస్త్రచికిత్స చేయించి కాపాడిన జూనియర్ అసిస్టెంట్



న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: తీవ్రంగా గాయపడిన పిల్లి పిల్లకి శస్త్రచికిత్స చేయించడమే కాకుండా రోజూ అవసరమైన సపర్యలు చేస్తున్నారు.. ఆయనే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండం తిరుమల్‌రెడ్డి. జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామం ఆయన సొంతూరు. మూడు నెలల క్రితం తరిగొప్పులలోని ఆయన ఇంట్లో ఓ పిల్లి పిల్లలను పెట్టింది. 15 రోజుల తర్వాత అందులోని ఓ పిల్లికూన ఇంటి ముందు రోడ్డుపై వెళ్తుండగా కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన పిల్లి కూన వెనుక రెండు కాళ్లు దెబ్బతిని నడవలేక పోయింది.

వదిలేయలేదు

గమనించిన తిరుమల్‌రెడ్డి ఊరకే వదిలేయకుండా పిల్లి పిల్లను ఇంట్లోకి తెచ్చారు. సమీపంలోని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువెళ్లి చూపించగా పరీక్షించిన వైద్యులు అది బతకడం కష్టమని వదిలేయమని సలహా ఇచ్చారు. ఆయన దానిని వదలేయలేదు. అక్కడి నుంచి వరంగల్‌లోని పశువైద్యశాలలో చికిత్స చేయించారు. కాస్త కోలుకున్నా నడవలేక పోయింది. తర్వాత హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ యూనివర్సిటీకి తీసుకువెళ్లి అక్కడి వైద్యులకు చూపించారు. వారు సర్జరీ చేయాలని చెప్పి కొన్ని మందులు సూచించారు. రెండు రోజుల అనంతరం హనుమకొండలోని ప్రైవేటు పశువైద్యశాలలో చూపించారు. వైద్యులు పలు పరీక్షలు చేసి పిల్లికి నడుముతో పాటు కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. బాగా దెబ్బతిన్న ఒక కాలును తొలగించారు. ప్రస్తుతం ఇంట్లో ప్రత్యేక బోనులో ఉంచి ఆయన సంరక్షిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండటానికి దాని మెడకు కాలర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు కాళ్లతో నిలబడుతూ మెల్లగా నడవడానికి యత్నిస్తోంది. వైద్యం కోసం ఆయన ఇప్పటికే రూ.50 వేలు ఖర్చు చేశారు. ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ మందులు, పాలు, ఇతర ఆహారం తదితరాలకు రోజూ రూ.200 ఖర్చవుతున్నట్లు తిరుమల్‌రెడ్డి తెలిపారు. గాయం పూర్తిగా మానిన తర్వాత కృత్రిమ కాలు కోసం ప్రయత్నిస్తానన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వివాహిత దుర్మరణం



రాయపోల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు దిచక్ర వాహనాలు ఢీకొని మహిళ దుర్మరణం చెందింది. భర్తకు గాయాలయ్యాయి. మరో వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలు కాలేదు. ఎస్ఐ మానస తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు ఉడిది రామస్వామి, **అమృత** (48) వ్యవసాయం పనులు చేస్తుంటారు. శనివారం ఉదయం తమ ద్విచక్ర వాహనంపై పొటానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి బయలు దేరారు. రాయపోల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళ్తున్న మరో వాహనం ఢీకొట్టింది. రామస్వామి కాళ్లకు, భార్య అమృత తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా దారిలో ఆమె మృతి చెందింది. కుమార్తె మరియ ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం



దగ్ధమవుతున్న కారు

చేగుంట, న్యూస్‌టుడే: కారులో ఒక్కసారిగా మంటలు ఎగసి పడి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు చెందిన మనోజ్, మీనాక్షితో పాటు మరొకరు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చేగుంట బైపాస్ సర్కిల్ వంతెనపైకి రాగానే పొగలు వచ్చాయి. వంతెన దిగిన తర్వాత కారును పక్కకు ఆపి అందులో ప్రయాణిస్తున్న వారు దిగి బ్యానెట్ తెరిచి చూస్తుండగానే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్యాస్‌తో నడిచే కారు కావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. రామాయంపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	117–00	డ్రెస్డ్	223–00
రిటైల్	144–00	స్కిన్‌లెస్	252–00

టీపీఎస్‌లుగా ఆదర్శ పాఠశాలలు

• గ్రామీణ విద్యార్థులకు వరం



సంగారెడ్డి జిల్లాలోని మోర్గి పాఠశాల

న్యూస్‌టుడే, మనూరు: గ్రామీణ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమ విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. సత్ఫలితాలు వస్తుండటంతో వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్)గా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య నుంచి అయిదో తరగతి వరకు ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలోని బృందం పాఠశాలలను సందర్శించి నివేదికలను రూపొందించింది.

మూడు జిల్లాల్లో ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో 31 ఉన్నాయి. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇటీవల రాష్ట్ర బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలు, తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో వంద మంది ఇంటర్ బాలికలకు మాత్రమే వసతి గృహ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రీప్రైమరీ (నర్సరీ) నుంచి 5వ తరగతి వరకు ప్రవేశపెట్టి.. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే అందులో చేరిన విద్యార్థి ఇంటర్ వరకు చదువుకోవచ్చు. అంతేకాదు టీపీఎస్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. దీంతో ఆకలి బాధలు సైతం ఉండవు. ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తే ఇంటి నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇది పేద విద్యార్థులకు వరంగా మారనుంది.

రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి

పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే ఏటా ప్రవేశాల కోసం రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి. టీపీఎస్‌గా మారితే మరింత డిమాండు పెరుగుతుంది.
–సువర్ణ, ప్రిన్సిపల్ ఆదర్శ పాఠశాల, మోర్గి, సంగారెడ్డి జిల్లా

ఆదర్శ పాఠశాలల వివరాలు

సంగారెడ్డి: మోర్గి, అక్సాన్‌పల్లి, బస్వాపూర్, బొల్లారం, మాచునూర్, ఝరాసంగం, మునిపల్లి, పోతులబొగుడ, రాయికోడ్, వెలిమెల
మెదక్: చేగుంట, జక్కపల్లి, కోమటిపల్లి, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, తిర్మలాపూర్
సిద్దిపేట: బెజ్జంకి, హుస్నాబాద్, సముద్రాల, నంగునూరు, మిరుదొడ్డి, ఇర్కోడ్, లచ్చపేట, చిన్నకోడూరు, జగదేవపూర్, కొండపాక, ముత్రాజ్‌పల్లి, దౌల్తాబాద్, చేర్యాల, మద్దూరు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రిఫరీగా అందోలు వాసి



తరుణ్‌రాజ్, పీఈటీ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) జాతీయ కబడ్డీ పోటీల రిఫరీ(న్యాయ నిర్ణేత) పరీక్షలో సంగారెడ్డి జిల్లా అందోలు గ్రామానికి చెందిన తరుణ్‌రాజ్ ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ కోచ్‌గా సేవలందిస్తూ జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా అర్హత సాధించడంపై అందోలు క్రీడాభివృద్ధి కమిటీ, జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తరుణ్‌రాజ్ సంగారెడ్డి మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్ 95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్ 80085 73222	శివ్వంపేట 8008573227
తూప్రాన్ 96762 58144	(10AM TO 1 PM)
చేగుంట 80085 73200	

న్యూస్‌టుడే, హవేలిఘనపూర్: ? మండల పరిధి రాజ్‌పేట తండా నుంచి కాప్రాయిపల్లి వెళ్లే దారిలో ఉన్న వంతెన నిర్మించి ఏళ్లు గడవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మించాలి. – సాయి కుమార్, కాప్రాయిపల్లి.

✓ వంతెనను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్, ఎంపీడీవో హవేలిఘనపూర్.

న్యూస్‌టుడే, శివ్వంపేట: ? శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో ముదిరాజ్ సామాజిక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని కోరుతున్నారు.

– గ్రామస్థులు, పిల్లుట్ల

✓ సామాజిక భవనాలు పూర్తి చేయడానికి వీబీ జీ రాంజీ నిధుల నుంచి ప్రతిపాదనలు పంపే విధంగా కృషి చేస్తాం. నిధులు రాగానే నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపడతాం. – **అమరేశ్వర్, పీఆర్, డిప్యూటీ ఈఈ, నర్సాపూర్**



ఆకట్టుకున్న తీజ్ వేడుకలు

రామాయంపేట(చేగుంట): కాట్రియాల తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఆకట్టుకున్నాయి. యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి మొలకలతో ఉన్న తీజ్ బుట్టలను ఎత్తుకున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తారు.

మూడు కిలోమీటర్లు.. ముప్పుతిప్పలు

న్యూస్‌టుడే, నర్సాపూర్: అది మారుమూల తండా. గ్రామాలకు దూరంగా విసిరేసినట్లుగా ఉండే ఆ తండాకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. మట్టి రోడ్డు వర్షాలకు అధ్వానంగా మారడంతో గిరిజనులు నిత్యం నరకం చూస్తున్నారు. కౌడిపల్లి మండలం వెంట్రావుపేట, మండలంలోని అహ్మద్‌నగర్ గ్రామాల మధ్య గల తారు రోడ్డు నుంచి పిల్లిగుండు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జువ్విపోచమ్మ తండా వరకు మూడు కిలో మీటర్ల పొడవునా మట్టి రోడ్డు ఉంది. తండాలో 400 మంది గిరిజన జనాభా నివసిస్తోంది. రోడ్డు సౌకర్యం సరిగా లేనందున తండాలో ఎవరైనా అనారోగ్యం బారిన పడినప్పుడు ఆసుపత్రికి, పండించిన ధాన్యాన్ని రవాణా చేయడానికి కష్టమవుతోంది.

రూ.1.20కోట్ల నిధులు...

గతంలో తండాకు వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులు రూ. 1.20కోట్ల నిధులు తారు రోడ్డు నిర్మాణానికి మంజూరైనట్లు ప్రకటించారు. కాని దశాబ్దం గడుస్తున్నా అడుగు ముందుకు పడలేదు. రోడ్డును ఇరువైపులా విస్తరించి కంకర రోడ్డు



అధ్వానంగా జువ్విపోచమ్మ తండా రోడ్డు

నిర్మించాక తారు రోడ్డు నిర్మాణం చేపడితే సౌకర్యవంతంగా ఉంటుందని అంటున్నారు. తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలు ఉన్నాయి. మండల, జిల్లా స్థాయి అధికారులు తండాకు రావడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని, వచ్చినా అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారని గిరిజనులు వాపోతున్నారు.

ప్రైవేటు గోదాంలతో రోడ్డు అధ్వానం...

తండాకు వెళ్లే మార్గంలో మధ్యలో ప్రైవేటు గోదాంలు ఉన్నాయి. వాటిల్లోకి బియ్యం లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డంతా పాడవుతోంది. నిత్యం 50-60 లారీల వరకూ వస్తున్నాయి. కిలోమీటరు పొడవునా రోడ్డంతా పూర్తిగా అధ్వానమైంది. లారీల రాకపోకలతో గిరిజనులు ప్రయాణం సాగించడానికి జంకుతున్నారు. రైస్ మిల్లుల నుంచి సీఎమ్మార్‌ను పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ప్రైవేటు గోదాంలకు లారీల్లో తరలిస్తుంటారు. ఇక్కడి గోదాంలు కొన్ని వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగి ఉండటంతో నిత్యం వందలోపు లారీలు తరలి వస్తుంటాయి.

తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి...

పోచమ్మ తండాకు తారు రోడ్డు నిర్మాణం తప్పక చేపట్టాలి. గతంలోనూ పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఆచరణకు వచ్చే సరికి ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్మిస్తే తండా వాసులకు సౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా రైతులకు, విద్యార్థులకు దారి సరిగా లేక ఇబ్బంది కలుగుతోంది. – ఫకీరా, స్థానికుడు

తహసీల్దార్ భవనం.. స్లాబు వేసి ఐదేళ్లు



రామాయంపేటలో తహసీల్దారు కార్యాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. ఐదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టి స్లాబు వరకు పనిచేసి వదిలేశారు. సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాని మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుతం ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరటంతో ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి ఉంది. దీంతో విధుల్లో ఉన్న ఉద్యోగులు, ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. నిర్మాణం చేపట్టిన భవనం వెంటనే పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రామాయంపేట(చేగుంట)

కోతులను తరమడానికి వినూత్న ప్రయత్నం

కొల్చారం, న్యూస్‌టుడే: కోతులను తరమడానికి అప్పాజీపల్లి గ్రామస్థులు ఆదివారం వినూత్న ప్రయత్నం చేశారు. సర్పంచి వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తుల ఎలుగుబంటి వేషం వేయించారు. ఈ వేషంతో గ్రామంలోని వాడవాడలా తిరుగుతూ కోతులను తరిమికొట్టారు. వీరికి తోడుగా గ్రామస్థులంతా అరుస్తూ కోతులను గ్రామ శివారులోకి తరిమారు. భయపడిన కోతులు గ్రామం విడిచి పారిపోయాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి నర్సింలు తదితరులున్నారు.



కోతులను తరమడానికి ఎలుగుబంటి వేషం వేసిన గ్రామస్థులు

శుద్ధి జలం ప్లాంట్ ఏర్పాటు

వెల్దుర్తి(మాసాయిపేట), న్యూస్‌టుడే: తాను చదువుకున్న గ్రామమైన మాసాయిపేటకు భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు అందిస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎంఏ మజీద్ తెలిపారు. మాసాయిపేటలో సొంత ఖర్చుతో రూ. 1.50 లక్షలతో శుద్ధి జలం ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా మజీద్ మాట్లాడారు. మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నాను. ఈ గ్రామ పూర్వ విద్యార్థిని నేనే గతంలోనూ పాఠశాలలో, గ్రామంలో రెండు శుద్ధి జలం ప్లాంట్‌లు ఏర్పాటు చేశానని మజీద్ గుర్తు చేశారు. ఉప సర్పంచి నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సిద్దిరాములుగౌడ్, నర్సింలు, పారిశ్రామిక వేత్త అన్వర్ పలువురు పాల్గొని మజీద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



రాజిరెడ్డితో కలిసి ప్లాంటును ప్రారంభిస్తున్న పారిశ్రామిక వేత్త



మాసాయిపేటలో బోనాలతో మహిళలు

మహంకాళి అమ్మవారికి బోనాల సమర్పణ

వెల్దుర్తి(మాసాయిపేట), న్యూస్‌టుడే: మండల కేంద్రమైన మాసాయిపేటలో కొలువైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. మత్స్యకారులు జల పందిరి ఊరేగించారు. కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, భారాస మాసాయిపేట మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి నాగరాజు, ఉప సర్పంచి ఉద్దండపురం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

చాముండేశ్వరాలయంలో భక్తుల రద్దీ

న్యూస్‌టుడే, చేగుంట కౌడిపల్లి,మనోహరాబాద్ , అల్లాదుర్గం చిలప్‌చెడ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చిట్కుల్ చాముండేశ్వరీ మాత ఆలయం శ్రావణమాసం సందర్భంగా భక్తుల రాకతో రద్దీగా మారింది. ● చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ● తునికి గ్రామ శివారులో వెలసిన నల్లపోచమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. ఉమ్మడి జిల్లాతోపాటు జంటనగరాల నుంచి విశేష సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. మండపంలో దర్శనం కోసం క్యూలైన్లలో నిల్చున్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో జూనియర్ సహాయకులు వెంకట్‌రెడ్డి సిబ్బంది తగిన సౌకర్యాలను కల్పించి పర్యవేక్షించారు. ● మనోహరాబాద్ మండలంలోని రంగాయపల్లిలో ఆదివారం గ్రామదేవతలకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



దర్శించుకుంటున్న భక్తులు

నర్సాపూర్‌లో అత్యధిక ఇళ్ల నిర్మాణం

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ పురపాలికలో అత్యధిక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం ద్వారా ఆదర్శంగా నిలిచినట్లు పుర అధ్యక్షురాలు లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. నర్సాపూర్‌లో నూతనంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టి గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని అన్నారు. రెండో విడతలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి పొందిన వారు నిర్మాణాలను ప్రారంభించాలన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

అల్లాదుర్గం: ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన ఘటన అల్లాదుర్గం మండలంలోని చేవెళ్లలో ఆదివారం చోటు చేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. చేవెళ్లకు చెందిన గోపాల్, వినోద దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు వినయ్(24)కి వివాహమైంది. గోపాల్ గతంలో చనిపోగా వినోద కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వినయ్ భార్య.. గతంలో కుటుంబంలో జరిగిన గొడవలతో పుట్టింటికి వెళ్లిపోయింది. వినయ్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు బావిలో పడటంతో స్థానికులు గమనించి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మద్యం మైకంలో బావిలో పడ్డాడా? లేక ఏమైనా ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై శంకర్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అసంపూర్తి భవనం.. తప్పని పాట్లు



మండలంలోని ఎర్రకుంట తండాకు గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, కరెంటు ఏర్పాటు చేస్తే వినియోగంలోకి వస్తోంది. సేవాలాల్ జగదాంబ ఆలయ సంబంధించి చిన్న రేకుల షెడ్డు నిర్మాణం చేశారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయం అందులో నిర్వహిస్తున్నారు. త్వరగా పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని తండా వాసులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, నర్సాపూర్**

పీజీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ ఉస్మానియా పీజీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సులో ఈనెల 31 నుంచి సెప్టెంబరు 3వ వరకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మనోహరాబాద్: మండలంలోని పర్కిబండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్రి అశోక్, ఉపాధ్యక్షుడు బండమీది ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బుర్తి మల్లేశ్, కోశాధికారి ప్రభాస్, కార్యదర్శి రాజు, ప్రచార కార్యదర్శి సుధాకర్, సలహాదారుడిగా లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు మురళీ, నాయకులు కార్యకర్తలున్నారు.

వెల్దుర్తి నుంచి మెదక్‌కు మహా పాదయాత్ర: భారాస

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రమైన మెదక్ వరకు పూర్తిగా శిథిలమైన రోడ్డును పటిష్ఠం చేయాలని డిమాండ్‌తో సోమవారం చేపట్టనున్న వెల్దుర్తి నుంచి కలెక్టరేట్ వరకు మహా పాదయాత్రను విజయవంతం చేయాలని భారాస జిల్లా నాయకులు వెన్నవరం మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డిలు కోరారు. ఆదివారం వెల్దుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రహదారులు సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వారు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో..

ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుందని శెట్టిపల్లికలాన్ గ్రామానికి మధ్యాహ్నం పాద యాత్ర చేరుకుంటుందని వివరించారు. ఈ సమావేశంలో భారాస సీనియర్ నాయకులు కోదండ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తోంది ఏఐటీయూసీ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి ఏసురత్నం అన్నారు. నర్సాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం కంటే ముందే కార్మిక సంఘాలు, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాల చట్టం, తదితర హక్కులను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాడి సాధించమన్నారు. మహాసభల సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నందం, జిల్లా కార్యదర్శి దొంతికేశవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రాంచందర్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకులు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

30 నెలలుగా పల్లె దవాఖానాకు తాళం



శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామంలో పల్లె దవాఖానా కొత్త భవనం నిర్మాణం రూ.20 లక్షలతో 30 నెలలు అయ్యింది. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు అందించకపోవడంతో గుత్తేదారు కిషన్‌రావు ఆ భవానికి తాళం వేసి ఉంచారు. ప్రస్తుతం పల్లె దవాఖానాను సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. భవనం నిర్మాణానికి సంబంధించిన నిధులు ప్రభుత్వం అందిస్తే పల్లె దవాఖానా భవనం వినియోగానికి మోక్షం లభించనుంది. ఈ విషయమైన సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బోర్డు ఇలా.. గ్రామం పేరు తెలిసేదెలా..!



టేక్మాల్ మండల పరిధిలోని ధనూర గ్రామ శివారులో ఊరు పేరు తెలిపే బోర్డు రోడ్డు పక్కన కింద పడిపోయింది. అయినా సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదు. కొత్తగా గ్రామాలకు వచ్చే వారికి గ్రామం పేరు తెలియకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. టేక్మాల్ నుంచి ధనూర మీదుగా జోగిపేటకు ఉన్న ఈ రహదారి వెంట నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామ పరిధి తెలిపే బోర్డు పడిపోవడంతో కొత్త వ్యక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. – **న్యూస్‌టుడే, టేక్మాల్**

రోడ్డు వేయాలని డిమాండ్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: తమ గ్రామానికి తారు రోడ్డు వేయాలని మండలంలోని మగ్దుంపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు గ్రామ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. గత 16 సంవత్సరాలుగా ముగ్గురు సర్పంచులు మారినా తమ గ్రామానికి తారు రోడ్డు వేయ లేరని వాపోయారు. నిత్యం గుంతలమయమైనా రోడ్డు నుంచి మెదక్ పట్టణానికి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. గ్రామస్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే 108 అంబులెన్స్ వాహనం సకాలంలో రావడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

రాబోయే తరానికి కళలను పరిచయం చేయాలి

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: రాబోయే తరానికి కళలను పరిచయం చేయాలని జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రాచీన కళలను కాపాడం మనందరి బాధ్యత అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగన్న, నారాయణ, కళాకారులు యాదమ్మ, శేఖర్, కృష్ణ, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన మండలంలోని చిట్కుల్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నర్సింలు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామగల్ల శాంతమ్మ(73) ఇంటి వద్దే ఉంటుంది. శనివారం మధ్యాహ్నం కల్లు తాగి తిరిగి వచ్చే క్రమంలో సమీపంలో ఉన్న నీటి గుంతలో పడి గాయపడింది. గమనించిన గ్రామస్థులు ఆమెను జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శాంతమ్మ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కుమారుడు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం కాస్తాపూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ఎస్సై సృజన తెలిపిన ప్రకారం సుమారు 30 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రామాయంపేట వైపు నుంచి నడుచుకుంటూ వస్తుండగా, వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

దేశం గర్వించదగ్గ ప్రధాని

నర్సాపూర్, న్యూస్‌టుడే: దేశం గర్వించదగ్గ ప్రధాని నరేంద్ర మోదీ అని భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్‌లోని ఆయన నివాస గృహంలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి టీవీలో ఆదివారం వీక్షించారు. మూడు సార్లు పార్టీని కేంద్రంలో అధికారంలోకి రావడానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే కారణమని పేర్కొన్నారు.

అదుపుతప్పి..రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

నర్సాపూర్ రూరల్: కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. మెదక్ జాతీయ రహదారిలో నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలో హైదరాబాద్ నుంచి మెదక్ వెళుతూ మలుపు వద్ద కారు అదుపు తప్పింది. తలకిందులుగా పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై రంజిత్‌రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

వర్షాకాలం.. ప్రణాళిక అవసరం

కల్వర్టులు లేక.. నీటి నిల్వలు

న్యూస్‌టుడే, తూప్రాన్:

వానా కాలంలో భారీగా నీరు చేరినప్పుడు పలు కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూప్రాన్‌లోని 1, 8, 12 వార్డుల్లో నీరు నిలవడంతో ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాలు కురిసినప్పుడు నీరంతా తూప్రాన్ పెద్ద చెరువులోకి చేరుతోంది. ఈ సమయంలో కాలువలు కల్వర్టులు సరైన విధంగా లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. ముందస్తు ప్రణాళికతో అధికారులు వీటన్నింటిని గుర్తించి మరమ్మతులు చేయిస్తే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తూప్రాన్ -నర్సాపూర్ రోడ్డులో అధికం..

తూప్రాన్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్లే దారిలో కి.మీ. వ్యవధిలో పెద్ద చెరువులోకి వెళ్లే 8 కల్వర్టులు ఉన్నాయి. కానీ పూడిక తీత చేయాల్సిన పరిస్థితి. కేవలం రెండు చోట్ల మాత్రమే నీరు వెళ్తున్నాయి. ఫలితంగా ఎక్కువ స్థాయిలో వర్షం కురిసినప్పుడు నీరు ప్రధాన రహదారి మీదుగా ప్రవహిస్తోంది. కల్వర్టులు సరి చేసి నీళ్ల నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌తో పాటు తూప్రాన్ పురపాలక కార్యాలయ అధికారులకు పలుమార్లు వినతులు అందజేశారు. కల్వర్టులు బాగు చేసి వర్షం ఎక్కడ నిల్వ ఉండకుండా వెళ్లి పోయేలా తగిన చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



కల్వర్టు పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు, కాలనీ వాసులు

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం

తూప్రాన్‌లో వర్షం కురిసినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఎనిమిదో వార్డులో గాయత్రినగర్‌లో కల్వర్టుల కబ్జాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటిని సరిచేసి నీరు నిల్వకుండా చొరవ తీసుకుంటాం.

–రమేష్ కుమార్ పుర కమిషనర్ తూప్రాన్



రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం వెంకటాపూర్ (ఆర్) గ్రామ పంచాయతీ శివారులోని వాగుపైన లోలెవల్ వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో వంతెనపైన దిమ్మెలు నిర్మించినా వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ప్రతిసారి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వంతెనపైన నుంచి వరద ప్రవహించి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు వెంకటాపూర్ మీదుగా శివ్వంపేట మండలం కొత్తపేట వరకు ఉన్న తారు రోడ్డు రెండు మండలాలకు అనుసంధానంగా ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. లోలెవల్ వంతెన కావడంతో వంతెన వద్దకు రాగానే అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించి హైలెవల్ వంతెనకు ప్రతిపాదిస్తే వరద వచ్చినా కూడా రాకపోకలు సాగడానికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని వాహనదారులతో పాటు స్థానికులు సూచిస్తున్నారు.

అన్ని సందేశాలకు స్పందించొద్దు

రేగోడ్, న్యూస్‌టుడే: చరవాణులకు వచ్చే అనుమానిత సందేశాలకు స్పందించవద్దని ఎస్సై పోచయ్య అన్నారు. రేగోడ్ ఠాణాలో ఆదివారం మాట్లాడుతూ గృహాల్లో చిన్నారులకు చరవాణులను వీలైనంత దూరంగా ఉంచాలన్నారు.

కొనసాగిన శ్రమదానం

తూప్రాన్, న్యూస్‌టుడే: మండలంలోని మల్కాపూర్‌లో ఆదివారం శ్రమదాన పనులు కొనసాగించారు. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి వీధుల్లో చెత్తాచెదారం తొలగించారు. మొక్కలకు నీరు పోశారు. సర్పంచులు ఆంజనేయులుగౌడ్, యువకులు చిన్నారులు పాల్గొన్నారు.